క్లుప్తంగా

31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగాల పన్నులు ఈనెల 31లోపు ఒకేసారి చెల్లించే వారికి వడ్డీ రాయితీ లభిస్తుందని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఒకేసారి పన్ను చెల్లించే వారికి వడ్డీ మినహాయింపు లభిస్తుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వడ్డీ మినహాయింపు పొందాలని ఆయన కోరారు.

ఘనంగా సీతమ్మ గుట్ట తిరునాళ


ప్రత్యేకలంకరణలో శివలింగం

సదుం: మండలంలోని సీతమ్మ గుట్టపై శనివారం తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి మరుసటి రోజు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. గుట్టపై ఉన్న సీతమ్మ, శివాలయాలను పెద్ద ఎత్తున భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టకింద ఉన్న గణపతి, ఆంజనేయ ఆలయాలను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పది పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. కల్లూరు, పులిచెర్ల హైస్కూల్, మంగళంపేట, కొత్తపేట, కావేటిగారిపల్లె హైస్కూళ్ల కేంద్రాలకు విద్యార్థులు హాజరు కానున్నారు. 371మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

చిన్నారికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

పలమనేరు: మండలంలోని మొరం గ్రామానికి చెందిన సర్వీస్ టూ సొసైటీ నిర్వాహకులు అశోక్ ఆలమట్టి కర్ణాటకలోని మాలూరు తాలూకా మాస్తి గ్రామంలో మెదడువాపు వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి చికిత్స కోసం శనివారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ఆ గ్రామానికి వెళ్లి నిర్ధారించాక స్నేహితులు బాబు, వాసు, శీను, లక్ష్మి, సారిక, హరి, మంజుల, చిన్నా సాయంతో ఆర్థిక సాయాన్ని అందించారు.

మున్సిపల్ సమావేశం రేపు

పుంగనూరు: మున్సిపల్ అత్యవసర సమావేశం ఈనెల 11న సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అత్యవసర సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కబడ్డీ విజేతలకు నగదు ప్రదానం

గంగవరం: మహాశివరాత్రి రోజున మండలంలోని కొత్తపల్లిలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేసినట్టు సర్పంచ్ గిరిరాజారెడ్డి తెలిపారు. పేర్ణంబట్టుకు చెందిన రాజన్ జట్టు మొదటి స్థానంలో నెగ్గి రూ. 25,116 ప్రైజ్ మనీ అందుకున్నట్టు తెలిపారు. అలాగే రెండవ బహుమతి జేకొత్తూరు జట్టు రూ.15,116, మూడవ బహుమతి శ్రీవినాయక ముదరంపల్లి జట్టు రూ.10,116 ఇలా మొత్తం ఆరు జట్లకు నగదు మహుమతి అందజేసినట్లు పేర్కొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు చేసుకుంటున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐకేర్ ఆస్పత్రి వారు సంయుక్తంగా శనివారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు చికిత్స చేసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పెద్ద ఎత్తున చికిత్స చేసుకున్నారు.

నిరంతరం అందుబాటులో ఉంటా


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే స్పందిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటానని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం మండలంలోని మోట్లపల్లిలో రూ.29 లక్షలతో మోట్లపల్లి నుంచి ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ముందుగా ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నూతనంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపడుతున్నట్లు చెప్పారు. జగనన్న చెపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి సీఎంకు శ్రీరామరక్ష అన్నారు. జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని కొనియాడారు. టీడీపీ లాగా ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అమలు కానీ హామీలు గుప్పిస్తూ బురిడీ కోట్టించే చంద్రబాబుకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని తెలిపారు. గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమైందని, ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పీఎస్ నాగరాజు, ఎస్ఏగొస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబు, సర్పంచ్ రమేష్ బిల్లా, నేతలు పెద్దప్పయ్య రెడ్డి, హరి, నాగరాజు, కుమార్‌రాజా, కుమార్ రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

కమనీయం...కల్యాణం


కట్ట కింద శివాలయంలో భక్తుల రద్దీ

-ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం


రొంపిచెర్ల: శివపార్వతుల కల్యాణోత్సవం

రొంపిచెర్ల: రొంపిచెర్ల కట్ట కింద శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్లకు చెందిన మెడికల్ దుకాణ యజమాని శ్రీనివాసకుమార్ మహాశివరాత్రి సందర్భంగా రూ.60 వేల విలువ చేసే శివపార్వతుల విగ్రహాలను వితరణగా ఇచ్చారు. దీంతో సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అర్చకులు మునిరాజశర్మ వేదమంత్రాలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు గీతాపారాయణం చేశారు. మహాశివరాత్రి పండుగలో భాగంగా శనివారం కట్ట కింద శివాలయంలో సిద్ధపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు పిల్లలు సిద్ధపూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నంది వాహనంపై బసవేశ్వరుడి చిద్విలాసం


నందిపై విహరిస్తున్న బసవేశ్వరుడు

చౌడేపల్లె: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని యర్రప్పల్లెలో బసవేశ్వరుడిని నందివాహనంపై శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజామున వరకు పురవీధుల్లో ఊరేగించారు. ప్రతిఏటా శివరాత్రి సందర్భంగా బసవేశ్వరస్వామి ఆలయంలో కనులపండువగా పూజలు చేశారు. ప్రతి ఇంటివద్ద ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మృత్యుంజయేశ్వరస్వామి సేవలో మహిళా కమిషన్ సభ్యురాలు


ఆలయం వెలుపల రుఖియాబేగం

చౌడేపల్లె: స్థానికంగా ఉన్న మృత్యుంజయేశ్వర స్వామిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుఖియాబేగం కుటుంబసభ్యులు డాక్టర్ రియా, గుణశేఖర్‌తో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. వారి వెంట సర్పంచ్ వరుణ్‌భరత్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఉద్యోగులకు మేలు


ఎమ్మెల్యే వెంకటేగౌడను సన్మానిస్తున్న నేతలు

పలమనేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఉపాధ్యాయ, ఉద్యోగులకు కోపం లేదని కేవలం టీడీపీకి చెందిన కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలను చేయిస్తున్నారని మాజీ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సోమచంద్రారెడ్డి అన్నారు. పలమనేరు నియోజకవర్గ కోకన్వీనర్, వైఎస్సార్ ట్రస్టు నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డితో కలిసి శనివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేగౌడను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలకంటే ఈ దఫా డీఎస్సీలో పోస్టులు ఎక్కువగా ఉన్నాయంటే అది కేవలం జగన్‌మోహన్ రెడ్డి చలువేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటికో ఉద్యోగమని మోసం చేసిందన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా లక్షలాదిమందికి ఉద్యోగాలను కల్పించిందన్నారు. నియోజకవర్గ కోకన్వీనర్ కృష్ణమూర్తిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు చేస్తున్న అజెండా లేని జెండాల కూటమికి ఓటర్లు గట్టిగా బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పలమనేరు మున్సిపల్, గంగవరం కన్వీనర్లు జాఫర్, మోహన్‌రెడ్డి, మాజీకన్వీనర్ మండీ సుధా, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, కౌన్సిలర్లు రహీంఖాన్, శ్యాం, నాగరాజు, నాయకులు ప్రహ్లాద, చలపతిరెడ్డి పాల్గొన్నారు.

యజమాని ఇంటికే కన్నం

- కారు డ్రైవర్ అరెస్ట్
- డూప్లికేట్ తాళం చెవితో దర్జాగా ఇంట్లో చోరీ
- నిందితుడి అరెస్ట్.. రూ.2లక్షల 80వేల నగదు స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ శేఖర్

మదనపల్లె: యజమానికి కొన్నేళ్లుగా నమ్మకంగా ఉంటూ, ఇంటి తాళం చెవిని దొంగిలించి, అన్నం పెడుతున్న ఇంటికే కన్నం వేసిన కారుడ్రైవర్ కటకటాల పాలైన సంఘటన శనివారం జరిగింది. శనివారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ ఎస్.శేఖర్‌తో కలిసి చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ పుంగనూరువాండ్లపల్లెకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్. కె.వెంకటరెడ్డి(పుంగనూరు గాంధీ) ఇంట్లో చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం అడవినాథునికుంటకు చెందిన సందిరెడ్డిగారి చంద్రశేఖర్‌రెడ్డి కొన్నేళ్లుగా కారుడ్రైవర్‌గా పనిచేస్తూ నమ్మకంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంటికి సంబంధించిన డూప్లికేట్ తాళాన్ని దొంగిలించి, గత ఏడాది జూన్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రూ.2.40లక్షలు దొంగిలించుకెళ్లాడు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 24న మరోసారి ఇంట్లోకి వెళ్లి రూ.40వేలు చోరీ చేశాడు. దీంతో వరుస చోరీలపై ప్రొఫెసర్ వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ ఎస్.శేఖర్, ఎస్ఐ రవికుమార్‌లతో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో కారు డ్రైవర్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు గుర్తించి, శనివారం మధ్యాహ్నం మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో నిందితుడిని అరెస్ట్ చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన క్రైంపార్టీ మహ్మద్, జయచంద్ర, ప్రభాకర్, నరసింహులు, రాఘవ డీఎస్పీ ప్రసాదరెడ్డి అభినందించారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి కుప్పం రాక

కుప్పం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం కుప్పంలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. కుప్పం మున్సిపాలిటీలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రామకుప్పంలో కనకదాస్ విగ్రహ ఆవిష్కరణ చేపడతారని, అనంతరం కుప్పం పట్టణంలో రూ.5 కోట్లతో నూత నంగా నిర్మించిన మున్సిపాలిటీ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రాజన్న క్యాంటీన్, పీఏసీఎస్ భవనం, కుప్పం చెరువు కట్టపై రూ.15 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. మంత్రి పర్యటనను నియోజకవర్గంలోని ప్రజాప్రతినిదులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గెవిమఠానికి గేటు వితరణ


గేటును ప్రారంభిస్తున్న దాత

చౌడేపల్లె: మండలంలోని మంచినీళ్లపల్లె సమీపం గెవి మఠంలోని వీరభద్ర ఆలయంలో భద్రత కోసం దాత ఏ.కొత్తకోట ఉపసర్పంచ్ వినోద్‌కుమార్‌రెడ్డి సహకారంతో గేటు ఏర్పాటుచేశారు. ఆలయంలో భద్రత కోసం రూ.70 వేల విలువజేసే ఇనుప గేటును ఏర్పాటుచేసి శనివారం ప్రారంభించారు. దాతను గ్రామస్తులు సత్కరించారు. నేతలు మహ్మద్ షఫీ, చిన్నా, ఆనందాచార్యులు, సదాశివ పాల్గొన్నారు.

సన్మానం


ఆదెమ్మను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని గంగమ్మతోపు పారిశుధ్య కార్మికురాలు బట్ట ఆదెమ్మను స్థానిక సేవా కార్యకర్త మోహన్ శనివారం సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో ఎన్నో సేవలందించిన వారిని కీర్తిస్తున్నామని కానీ పారిశుధ్య పనులు చేస్తూ సమాజానికి మేలు చేస్తున్న ఇలాంటి వారికి విలువ ఇవ్వాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ ముఠా

రామకుప్పం: కుప్పం ప్రాంతంలో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను రామకుప్పం పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. వారం రోజుల క్రితం మిట్టపల్లికి చెందిన ఓ యువకుడు ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని రాజుపేట రోడ్డు నుంచి ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యాద్యాన్ని తీసుకుని వస్తుండగా తిమ్మసముద్రం కాలనీ వద్ద కొందరు వ్యక్తులు అతని అడ్డుకున్నారు. తాము ఎక్సైజ్ పోలీసులమని చెప్పి మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లారు. మరుసటిరోజు ఆ యువకుడు కుప్పం ఎక్సైజ్ పోలీస్‌స్టేషనుకు వెళ్లగా తాము ఎవరూ ఆ రోజు తనిఖీలు నిర్వహించలేదని చెప్పడంతో అతను రామకుప్పం పోలీసులను ఆశ్రయించాడు.పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. కొంతమంది ముఠాగా ఏర్పడి కుప్పం ప్రాంతంలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఆ ముఠాను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నారని కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు మీడియా సమావేశంలో తెలియజేస్తామన్నారు. కాగా పోలీసుల అదుపులో ఉన్న ముఠాకు కుప్పం ప్రాంతానికి చెందిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ ప్రాతినిథ్యం వహించినట్లు తెలిసింది.

నేడు కొటాలలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

యాదమరి: మండలంలోని కొటాల గ్రామంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త బీఎంఆర్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. కొటాల గ్రామంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దీనికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎంపీపీ సురేష్ హాజరు కానున్నట్లు వివరించారు. దీనికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ హాజరుకావాలని కోరారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు


అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని బల్ల గ్రామంలో శనివారం అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అట్టడుగు, బలహీన వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగంలో హక్కులను కల్పించి వారి అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి డా.అంబేడ్కర్ అన్నారు. సమాజంలో ఎన్నో అవమానాలు భరించి అసమానతలను రూపుమాపిన మహనీయుడు అంబేడ్కర్ అని తెలిపారు. భారత రాజ్యాంగం అందించిన రిజర్వేషన్ల ఆధారంగా రాజ్యాధికారం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ప్రయాసలతో భారత రాజ్యాంగం రచించిన అంబేడ్కర్‌ను గౌరవించడం అందరి బాధ్యత అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు ప్రధాన పీట వేశారన్నారు. కుప్పం నియోజకవర్గంలో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందని భరోసానిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ సభ్యురాలు పెరితాయమ్మ, రెస్కో డైరెక్టర్ థామస్, మండల కోఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ హేమ, నేతలు శంకర్, పెనువేలు సింహ, సతీష్, మురుగేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎంపీ విరాళం: రామకుప్పంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీ రెడ్డెప్ప రూ.లక్ష విరాళంగా అందజేశారు. అదేవిధంగా బల్ల గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి రూ.50 వేలు అందించారు. దళిత సంఘాల నేతలు ఎంపీ రెడ్డెప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పథకాలే ఓటు బ్యాంకు


మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఓటు బ్యాంకుగా నిలవాలని ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని సోడిగానిపల్లెలో శనివారం నవరత్నాల పథకాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. నవరత్నాల పథకాలు ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తారన్నారు. కుప్పంలో భరత్‌ను అత్యధిక ఓట్లతో గెలిపించాలన్నారు. అనంతరం సోడిగానిపల్లె, మల్దేపల్లె, అలుగుమానిపల్లె, కేసీపల్లె, తిమ్మనాయనపల్లెలో రూ.12 లక్షల 50 వేలతో నూతన హైమాస్ లైట్లను ప్రారంభించారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ చొరవతో హైమాస్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. మండల కోకన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ సుశీలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, నేతలు నారాయణస్వామి సంపంగి పాల్గొన్నారు.

శిలాఫలకాలకే పరిమితం


విలేకర్లతో మాట్లాడుతున్న రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: టెంకాయలు కొట్టేసి...శిలాఫలకాలు పెట్టేసి తానే అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకుంటున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని కుప్పం వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మొగసాల రెడ్డెప్ప అన్నారు. బైరెడ్డిపల్లెలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరనాథరెడ్డి పరిశ్రమలశాఖ మంత్రిగా కొనసాగిన రోజుల్లో ఏమాత్రం అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఎన్నికల సమీపిస్తున్నాయని ఉత్తొత్తి జీఓలతో ప్రజలను మభ్యపెట్టి శిలాఫలకాలు ఏర్పాటు చేసి టెంకాయలు కొట్టి వదిలివేశారన్నారు. రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారథ్యంలో పలమనేరు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తున్న విషయం అమరనాథరెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్నారు.

కోలాహలం.. రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

బైరెడ్డిపల్లె: కార్వేటికొండపై వెలసిన శ్రీకాళభైరవేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి రథోత్సవం కోలాహలంగా సాగింది. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై గిరిజా సమేత కాళభైరవేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను ఈ సందర్భంగా పర్యవేక్షించారు.

చురుకైన పాత్రను పోషించాలి



మహిళా టీచర్లు, అంగన్‌వాడీలను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: మహిళా ఉపాధ్యాయులు బడిలో బోధన ఎలా బాధ్యతగా చేపడతారో అదే రీతిలో ఉద్యమాల్లోనూ చురుకైన పాత్రను పోషించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దీనవతి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళుతున్నారని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు మణిగండన్, సీపీ ప్రకాష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో మహిళా టీచర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.